క్లుప్తంగా

కొనసాగుతున్న వీరమ్మ తల్లి తిరునాళ్ల



ఉయ్యూరు: అమ్మా.. వీరమ్మా.. మము బ్రోవు మమ్మా.. అంటూ భక్తులు చల్లని తల్లికి పూజలు జరిపించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వీరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. అమ్మవారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. మహిళలు పాలపొంగళ్లు సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. పొట్టేళ్లను మొక్కుబడిగా సమర్పించారు. సంతానం ప్రాప్తించాలని మహిళలు అమ్మవారి సన్నిధిలో పానాచారం చేశారు. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ అమ్మవారి ప్రసాదాలను అందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతినిధులు రవిసుధాకర్, పినమాల నాగసుధాకర్ పాల్గొన్నారు. అవ్వురు రాజారావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

230 మందికి వైద్య పరీక్షలు




రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులు, సిబ్బందికి ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 230 మందికి పలు వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. తొలుత వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు ప్రారంభించారు. అమరావతి కంటి హాస్పిటల్, ప్రత్యూష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, దుహిత హాస్పిటల్, మిత్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో కళ్లు, దంతాలు, ఎముకలు, హియరింగ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఖర్చుతో కూడుకున్న వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నాదెళ్ల వేణు, జాస్తి ప్రత్యూష, శ్రీధర్, సతీష్, సత్యనారాయణ, భాస్కర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి



కంకిపాడు: గ్రామంలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. గ్రామంలో రూ.4 లక్షలతో అంతర్గత రహదారులు, జల్‌జీవన్ మిషన్ పథకం కింద పైపులైను విస్తరణ పనులను చేపట్టారు. ఈ పనులను శనివారం సర్పంచ్ విజయ చంద్రశేఖర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2012వ సంవత్సరంలో పేదలకు నివేశన స్థలాలు కేటాయించిన లే అవుట్‌లో సరైన రహదారుల సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను గుర్తించి రూ.4 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. రహదారుల అభివృద్ధి పనులతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



గన్నవరంరూరల్: మండలంలోని సావరగూడెం శివారు బొబ్బరవాగు సమీపంలో ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, రుద్రహోమం, పూజలు, హోమాలు జరిగాయి. కోలాట బృందం ప్రదర్శన అలరించింది. అనంతరం అన్నసంతర్పన నిర్వహించారు. సావరగూడెం, పురుషోత్తపట్నం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్లు

ఉత్సాహంగా వలంటీర్లకు వందనం



గంగూరులో వలంటీర్లతో సర్పంచ్ తస్లీమున్నిసా, అక్బర్‌పాషా తదితరులు

ఉంగుటూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వలంటీర్లు సేవే లక్ష్యంగా పని చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరు జగనన్న కాలనీ లే అవుట్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు సంక్షేమ వారధులుగా పని చేస్తున్నారన్నారు. సేవా వజ్ర పతకాన్ని సాధించిన పెద అవుటపల్లికి చెందిన రాజులపాటి అనూషను అభినందించారు. కాటూరు ప్రేమలత, ఇందుపల్లి జగపతిబాబు, పకీరు ప్రమోద్‌కుమార్, తిరుపతమ్మ ధారవతు, నాగనబోయన యామినిలక్ష్మి సేవా రత్న అవార్డులను పొందారు. మిగతా 307 మంది వలంటీర్లకు సేవ మిత్ర అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు వడ్లమూడి సరోజిని, అనగాని రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌసాని, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ తోట కరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నాయకులు గుడిసే బాలస్వామి, ఆర్నేపల్లి సింహాచలం, గ్రామాల సర్పంచ్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

గంగూరులో ఘన సన్మానం

పెనమలూరు: గంగూరు గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న వలంటీర్లను గ్రామ పంచాయతీ పాలకులు శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో వలంటీర్లుగా పని చేస్తున్న 32 మందిని సర్పంచ్ తస్లీమున్నిసా, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌పాషా శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. వలంటీర్లు నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. వలంటీర్లపై ప్రతి పక్షనేతలు ఆరోపణలు చేయటం దారుణమన్నారు. వాలంటీర్లు కుటుంబాలలో సభ్యులుగా ఉండి సేవలు అందిస్తున్న విషయం ప్రజలందరికి తెలుసన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతి వలంటీర్‌కు రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు ఎండీ.రఫి, ఇలియాస్, పి.రాజేష్, ఇంతియాజ్, యాహ్యా, బాషా, జోసఫ్ పాల్గొన్నారు.



ఉంగుటూరులో వలంటీర్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వలంటీర్ల సేవలు అభినందనీయం

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందజేయడానికి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్లను నియమించారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 68 మంది వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



నున్నలో వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న నాగిరెడ్డి

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం

మంత్రి జోగి రమేష్

పెనమలూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పెదపులిపాక, చోడవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి గ్రామ సమస్యలు తెలుసుకొని, పార్టీ నేతలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాను అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే వేసవిలో తాగునీరు సమస్య రాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలి

వైఎస్సార్ సీపీ గెలిపించటానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయలని మంత్రి జోగి రమేష్ సూచించారు. ఆయన పార్టీ క్యాడర్‌తో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించి సీఎంను చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పార్టీకి సైనికుల్లా పని చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు గుంటూరు శ్రీనివాసాచౌదరి, కాకర్ల వెంకటరత్నం, సంగెపు శ్రీనివాసరావు, లింగాల భాస్కరరావు, అక్బర్ పాషా, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదపులిపాకలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పోరంకి సొసైటీ అధ్యక్షుడికి పరామర్శ

పెనమలూరు: పోరంకి సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ శనివారం పరామర్శించారు. సొసైటీ అధ్యక్షుడు పరమేష్ అనారోగ్యం కారణంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. దీంతో మంత్రి జోగి రమేష్ పోరంకిలో ఉన్న పరమేష్ స్వగృహానికి వచ్చి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. పోరంకిలో పార్టీని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని పరమేష్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతరావు, ఆకునూరు సుబ్బారావు, నల్లమోతు జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవాలు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. తొలుత అఖండ దీపారాధనతో కల్యాణ వేడుక ప్రారంభమైంది. అనంతరం అమ్మవారికి, స్వామివారికి కంకణధారణ, మానుపూజ, గ్రామ పొంగళ్లు సమర్పించారు. రాత్రికి శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం పలువురు దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించగా సుముహూర్తంలో వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారి కల్యాణాన్ని జరిపారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, పలువురు రాజకీయ, పుర ప్రముఖులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

చెంచుల కాలనీలో..

స్థానిక చెంచుల కాలనీలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలోనూ వార్షిక కల్యాణం నిర్వహించారు. తొలుత కోలాట నృత్య ప్రదర్శనలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి వార్లకు కల్యాణం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు.

పోరంకి రామాలయంలో విశేష పూజలు

పెనమలూరు: పోరంకి గ్రామం శ్రీనగర్‌కాలనీలో వేం చేసి ఉన్న శ్రీకోదండ రామాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సూర్యనారాయణస్వామికి మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భక్తులు పూజలు చేశారు. వేకువజామునే స్వామి అమ్మవార్లను అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోపూజ, శ్రీ సూర్యనారాయణస్వామివారి పూజ, స్తోత్ర పారాయణం, ఆవు పాలతో గుడి ఎదుట పొంగలి చేసి నివేదన చేశారు. అనంతరం భక్తులకు పొంగలి, తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి, ఎస్.సత్యనారాయణ, ఏలేశ్వరరావు, అంకెం రాజేష్, కనకరాజు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో మాఘ పూర్ణిమ సందర్భంగా శ్రీ కామాక్షి అమ్మవారికి శనివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య రాధనఃచంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానంలోనూ భక్తులు సూర్య ఆరాధనలు, సూర్య నమస్కారాలు,పొంగళి నివేదనలు, పూర్ణిమ చండీహోమాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మ వార్లను దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

వైభవంగా జీవధ్వజ పునఃప్రతిష్ఠ

ఉంగుటూరు: పొణుకుమాడులో శ్రీగంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలతో మూడు రోజులుగా జరుగుతున్న జీవధ్వజ పునఃప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో జీవధ్వజ, ద్వారపాలక, కాలభైరవ, బలిపీఠ ప్రతిష్ఠలు, విశేష హోమాలు, పూజలు వైభవంగా జరిగాయి. కీసరగుట్ట శ్రీవెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం శైవాగమ అధ్యాపకులు ఆగమిక బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ, పాలపర్తి ప్రేమ్‌చందుశర్మ సుముహూర్తం 11.46 గంటలకు యంత్రస్థాపన, బింబాస్థాపన(ధ్వజ ప్రతిష్ఠ)జీవన్యాసం, మహాపూర్ణాహుతి, మహానైవేద్యం, శాంతికల్యాణం, కుంభాభిషేకం, మహదాశీర్వచన, పండిత సత్కారం, అవబృదస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. త్రయాహ్నిక దీక్షతో సుంకర రాజేంద్రప్రసాద్, పద్మజ, సుంకర రవి, శ్రీదేవి, సుంకర రాజేష్ పద్మావతి దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సామూహిక సత్యనారాయణ వ్రతం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి ఆలయంలో అష్టమ వార్షికోత్సవంలో భాగంగా శనివారం రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం వ్యవస్థాపకుడు శ్రీ వాసుదేవానందగిరిస్వామీజీ పర్యవేక్షణలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని భక్తులు ఆచరించారు. అనంతరం స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఆదివారం ఆలయంలో సామూహిక చండీహోమం, సాయంత్రం పల్లకీసేవ, రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

యనమలకుదురులో..

యనమలకుదురులో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పవిత్రోత్సవం జరిగింది. శ్రీ స్వామివార్లకు రుద్రహోమం చేశారు. పూర్ణాహుతి, మండప ఉద్వాసన, పరివార దేవత సంప్రోక్షణ, నీరాజన మంత్రపుష్పం, పలు పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

ఉంగుటూరు: మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుని తమ కృతజ్ఞతను చాటుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షుడు తోట వెంకయ్య, వింత శంకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రమైన ఉంగుటూరులో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు శనివారం జరిగాయి. మండలంలోని 27 గ్రామాల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10,06,53,802 వైఎస్సార్ ఆసరా చెక్కును స్వయం సహాయక మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌసాని, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ తోట కరుణ, ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్ రంగారావు, ఏపీఎం సాంబశివరావు, మండల సమైఖ్య అధ్యక్ష కార్యదర్శులు జిన్నీ, భాగ్యలక్ష్మి, సీసీలు, వీవోఏ, వీఏఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ఉంగుటూరులో ఆసరా చెక్కును అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండల పరిధిలో కోట్లాది రూపాయలు వెచ్చించి పలు అభివృద్ధి పనులను దిగ్విజయంగా నిర్వహించామని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తెలిపారు. రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో శనివారం వివిధ అభివృద్ధి పనులకు శనివారం గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచ్ వరి శ్రీదేవిలు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ వద్ద రూ.8 లక్షలతో డ్రెయిన్లు, వైష్ణవి అపార్టుమెంట్ వద్ద రూ.4 లక్షలు, కాలువ అవతల మరో రూ.4 లక్షలు, రాజుల బజారులో రహదారి అభివృద్ధికి రూ.15 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు. పనులను శరవేగంగా పూర్తి చేస్తామన్నారు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో కూడా రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధి చేశామని చెప్పారు. జెడ్పీటీసీ సువర్ణరాజు, పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, కాంట్రాక్టర్ ఆంజనేయులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



రామవరప్పాడులో శంకుస్థాపన చేస్తున్న కొమ్మా కోట్లు, ప్రజాప్రతినిధులు

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గన్నవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎఫ్టానిక్స్ సిస్టమ్ సంస్థ చీఫ్ ఇంజినీర్ బి.సాంబిరెడ్డి సూచించారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎన్టీటీఎఫ్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాలు సాంకేతిక పరంగా వేగంగా వృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు వెళ్లాలని చెప్పారు. ముఖ్యంగా డిప్లొమో రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన సాంకేతిక విద్యను అందిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

బహుమతుల పంపిణీ..

ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవితాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ఎంతో మంది పరిశ్రమలు స్థాపించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్టీటీఎఫ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాజగోపాలన్, ప్రిన్సిపాల్ మహీధర్, ఏఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఫార్మా విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

రామవరప్పాడు: మానవాళికి ఉపయోగపడే సమర్థవంతమైన ఔషధాలు తయారు చేయగలగడానికి ఫార్మా రంగ విద్యార్థులు పరిశోధనాత్మకతపై దృష్టి సారించాలని డాక్టర్ సురేష్ వి.చెన్నుపాటి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు విజయ ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 18వ అంతర్జాతీయ ఇండో మలేషియన్ సదస్సు శనివారంతో ముగిసింది. 'ఔషధ రంగంలో ప్రపంచ స్థాయి సవాళ్లు - భవిష్యత్ ప్రణాళికలు' అనే అంశంపై అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ, అంతర్జాతీయ మలేషియా శాఖ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు సూక్ష్మమైన విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధనలు చేయాలని సూచించారు. హైదరాబాద్, చెన్నై నుంచి వచ్చిన ప్రొఫెసర్లు షణ్ముఖ సుందరం, సోమనాథ్ డేలు మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇనుమడింపజేసుకుని సమర్థవంతంగా పని చేసే ఔషధాలను పరిశోధించాలన్నారు. అనంతరం ఈ సదస్సులో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రయోగాలను పరిశీలించి బహుమతులు అందజేశారు. సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, అధ్యాపక బృందం, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ వి.చెన్నుపాటి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడుకు చెందిన వి.వంశీకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తాడు. అతను విజయవాడ నుంచి కంకిపాడుకు బైక్‌పై వస్తుండగా గోసాల చైతన్య కాలేజీ సమీపంలో వన్‌వేలో ఎదురుగా వచ్చిన కారు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి బలమైన గాయాలయ్యాయి. విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంశీకృష్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పాడి రైతులకు యాంజియోగ్రామ్ పరీక్షలు

గన్నవరం: కృష్ణా మిల్క్ యూనియన్‌కు అనుబంధంగా ఉన్న గన్నవరం క్లస్టర్ పరిధిలోని పాల సహకార సంఘాల్లో సభ్యులైన 20 మంది పాడి రైతులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు క్లస్టర్ మేనేజర్ కోటా ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాధా-లక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో పాడి రైతులకు విజయవాడలోని డాక్టర్ వరుణ్ కార్డియాక్ న్యూరో సైన్సెస్‌లో ఉచితంగా యాంజియోగ్రామ్ పరీక్షలు చేశారన్నారు. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చొరవతో పాడి రైతుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు.

రుణం పేరుతో నగదు స్వాహా

పెనమలూరు: రుణం ఇస్తామని నమ్మించి గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తి వద్ద రూ.1.20 లక్షల సొమ్ము స్వాహా చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప అంబేడ్కర్ కట్టకు చెందిన అంద్రాజు లక్ష్మణబాబు ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తాడు. అతను రుణం కోసం ఫోన్‌పే యాప్‌కు చెందిన ధనియా యాప్‌ను గత కొద్ది రోజుల క్రితం ఫోన్ ద్వారా సంప్రదించాడు. రూ.3 లక్షలు రుణం ఇస్తామని వారు తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.5,500 చెల్లించాలని చెప్పడంతో ఫోన్ పే ద్వారా సొమ్ము చెల్లించాడు. అలా లక్ష్మణబాబు ఆరు దఫాలుగా రూ.1.20 లక్షలు చెల్లించాడు. అయితే అతనికి రుణం సొమ్ము ఇవ్వక పోవటంతో తాను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు గ్రూప్ - 2 పరీక్ష నిర్వహణ

కంకిపాడు: గ్రూప్ - 2 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం గ్రూప్ - 2 పరీక్షల నిర్వహణకు ఆదేశాలు వెలువడటంతో పునాదిపాడులోని శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో పరీక్ష నిర్వహణకు సన్నాహాలు పూర్తి చేశారు. తహసీల్దార్ ఎం.రామకృష్ణ నేతృత్వంలో బృందం పరీక్షా కేంద్రాన్ని సందర్శించింది. అనంతరం ఇన్విజిలేటర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ.. 560 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. వీరికి గానూ 14 గదులను అన్ని వసతులతో ఏర్పాటుచేశామన్నారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా సీసీ కెమెరాల ఏర్పాటు, ఇన్విజిలేటర్ల సమర్థ పర్యవేక్షణలో పరీక్ష జరుగుతుందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని చెప్పారు. ఇన్విజిలేటర్లు సమర్థంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, చీఫ్ సూపరింటెండెంట్ కె.మంత్రునాయక్, ఆర్ఐ జి.రాఘవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

కంకిపాడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కంకిపాడు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలీ బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో అతని ఇంటిలో సోదా చేశారు. అక్రమంగా నిల్వ చేసి ఉన్న 10 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



కంకిపాడు: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లయన్స్ క్లబ్, మధు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కోరారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో లయన్స్ క్లబ్, మధు వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 200 మంది పేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పండ్లు అందజేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్‌ల ప్రతినిధులు మద్దుల గోవిందరావు, కె.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com